# చెప్పుల

## తులసి బాలకృష్ణ



ఆ రోజు శనివారం.

అలవాటు ప్రకారం స్నానం చేసి, గుడికి వెళ్లాను. చెప్పులు వారగా విడిచి, బావిదగ్గర కాళ్ళు కడుక్కుని, గుడిచుట్టూ ప్రదక్షిణాలు ప్రారంభించాను, కళ్ళు సగం మూసుకుని.

"ఆఁ... ఆఁ... దూరం... దూరం. తగులొస్తావ్"

—ఉలిక్కిపడి, కళ్ళు తెరిచాను. నా నుంచి దూరంగా జరుగుతూ, జపం చేసుకుంటూ, ముందుకు నడుచుకు పోయాడొకవ్యక్తి.

'గుళ్లో కూడా దూరం ఏవిఁట్రా దేవుడా?!!...' మూడు ప్రదక్షిణాలు పూర్తిచేసి, లోపలికి వెళ్లాను. కళ్లుమూసుకుని, భక్తిగా చేతులు జోడించి నమస్కరించాను భగవంతుడికి..

"తలమీంచి స్నానం చెయ్యలేదా నువ్వు?"

—మళ్ళీ ఉలిక్కిపడడం నావంతయ్యింది.

ఆదే గొంతు.

ఆతగాడే!

నన్ను ప్రశ్నిస్తున్నాడు. చిరాగ్గా చూస్తూ 'లేద'న్నట్టుగా తలవూపి, "మామూలుస్నానమే" అన్నాను.

తల అడ్డంగా వూపాడతను,— "గుడికి ఎప్పుడూ తలమీంచి స్నానం చేసి, పవిత్రంగా రావాలి"అని, కళ్లుమూసుకుని, భజన చేసుకోవడంలో నిమగ్నుడయ్యాడు— అందరికీ దూరంగా జరిగి.

ఒళ్లు మండిపోయింది నాకు.

పరిచయం లేనివ్యక్తి... ఈ నీతులేవిఁటి నాకు? శుద్ధ చాదస్తపు మనిషి. ముందు గుర్రుగా, ఆపైన పరీక్షగా చూసాను అతనివైపు — మధ్య పాపిడి తీసి, రెండు వైపులకే 'హెయిర్‌ఆడ్డు' దువ్విన తారు రోడ్డులాంటి నున్నటి జుట్టు, నుదుట పెద్ద కుంకంబొట్టు, రెండు చెవుల్లోనూ రెండు పెద్దపెద్ద గన్నేరు పూలు, తెల్లగా వుతికిన పైజామా, లాల్చీ

నా పరిశీలనకి అంతరాయం—గుడి బయట ఆవరణలో ఒక్కసారిగా గోల. అందరితో బాటే నేనూ బయటకు నడిచాను గబగబా నా చెప్పులు గుర్తుకురాగా. ఎవరో ఇద్దర్ని పట్టుకు తంతున్నారు జనం— వాళ్ళిద్దరూ చెప్పుల దొంగలట. గబగబా నా చెప్పులవైపు చూసుకున్నాను— అందులో కొత్తవి మరి. ఎక్కడ పెట్టినవి అక్కడే భద్రంగా వున్నాయి. చెప్పులు భద్రంగా వున్నందుకు తృప్తి చెందిన నా కళ్లు చాదస్తపు మనిషికోసం వెతికాయి. ఎక్కడాలేడు. ఒహవేళ గుళ్లోనే వుండిపోయాడేమో ! గబగబా లోపలికి నడిచాను. ఓ మూల కూర్చుని, భక్తిగా భజన చేసుకుంటున్నాడు—

ఒక్కసారిగా, ఇంతకుముందు అతనిమీద నాలో కలిగిన కోపం మాయమయ్యింది. గుళ్లో దేవుడి ముందు నిల్చునికూడా చెప్పుల మీద, బయట గోల మీద వుంది మా దృష్టి. అతనొక్కడూ మాత్రం చెక్కు చెదరని దైవ భక్తితో దేవుడిముందే కూర్చుని వుండిపోయాడు. మాలాగ చెప్పుల గురించి భయం లేదతనికి. భగవంతుడ్ని మనసా వాచా నమ్మిన వ్యక్తికి ఇటువంటి భయాలెందుకుంటాయి — నా మూర్ఖత్వం కాకపోతేనూ ?!

అతనివైపు నిశ్శబ్దంగా అడుగులువేసి, కొంచెం దూరంగా మౌనంగా కూర్చున్నాను.

మరో పది నిముషాలకు భజన పూర్తి చేసుకుని, కళ్లు తెరచి, "బయట ఇందాక ఆ గోల ఏమిటి తమ్ముడూ" అనడిగాడతను.

"చెప్పుల గోల" అని చెప్పడానికి మనస్కరించలేదు నాకు.

"చెప్ప బాబూ."

"చెప్పుల దొంగల్ని పట్టుకున్నారండీ. మీరు తప్ప అందరం మా చెప్పులున్నాయో లేవో చూసుకోవడానికి బయటకు పరుగెత్తాం" అన్నాను కొంచెం సిగ్గుపడూ.

తేలిగ్గా నవ్వాడతను, సన్నని ధ్వనితో.

ఎంతో వేదాంతం ధ్వనించింది ఆ నవ్వులో.

వసంత సమీరం, హేమంత తుషారం భాసించాయి ఆ నవ్వులో.

కన్నులు అరమోడ్చి, తల చిన్నగా తాటిస్తూ, అన్నాడతను, "దేవాలయానికి వచ్చేటప్పుడు ప్రతి విషయంలోనూ ముందే జాగ్రత్త వహించాలి తమ్ముడూ."

— వింటున్నాను భక్తిగా.

"దేవుడిముందు నిలబడికూడా చిత్తం చెప్పుల మీదయితే ఎలా ?"

— వింటున్నాను వినయంగా.

"అందుకనే నేనెప్పుడు దేవాలయానికి వచ్చినా ఏం చేస్తానో తెలుసా ?"

— వింటున్నాను ఆసక్తిగా.

"చెప్పులు ఎప్పుడూ బయట వదలను."

"మరి ?"

అలవోకగా నవ్వేడతను.

పైజామా రెండు జేబుల్లోకి చేతులు పోనిచ్చి, రెండు చెప్పుల్ని బయటకు లాగుతూ, "ఇదీ నేను చేసేది. ఎందుకంటే..."

— ఈసారి... నాకు వినిపించడంలేదు సరికదా... కనిపించడంలేదు కూడా... ★

